# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

**పత్రికా ప్రకటన**

**జూన్ 20, 2011**

# శిక్షణ పేరుతో బస్తర్‌లో జరుగుతున్న సైన్యం మోహరింపుకు వ్యతిరేకంగా జూలై 4 నుండి 11 వరకు 'నిరసన వారాన్ని' విజయవంతం చేయండి!

## ఆదివాసీ సముదాయాల సంస్కృతినీ, ఉనికినీ ప్రమాదంలో పడవేసే ప్రభుత్వ కుట్రలను ఓడించండి!!

దేశంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే దుష్ట తలంపుతో సోనియా–మన్మోహన్‌సింగ్– చిదంబరం పాలక ముఠా ప్రారంభించిన దేశవ్యాప్త నిర్బంధ క్యాంపెయిన్ – ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ఇప్పుడు సైన్యం మోహరింపు ప్రక్రియ మొదలైంది. ప్రస్తుతం బస్తర్ ప్రాంతంలోకి చాలా మోసపూరితంగా 'శిక్షణా శిబిరాల' ఏర్పాటు పేరుతో సైనిక దళాలను తరలించారు. సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా కనుసన్నల్లో దేశ దోపిడీ పాలకవర్గాలు, తాము స్వయంగా చెబుతున్న ఈ దేశవ్యాప్త 'సమన్వయపూర్వక దాడి'కి బ్లూ ప్రింట్‌ను తయారు చేసినపుడే సైన్యాన్ని మోహరించే పథకాన్ని కూడా రూపొందించాయి. మధ్య కమాండ్ కింద ఒడిషా, ఛత్తీస్‌గఢ్‌లను కలుపుతూ సబ్–ఏరియా కమాండ్ ఏర్పాటు చేశాయి. బిలాస్‌పూర్ దగ్గరలోని చకర్‌భాతా గ్రామ సమీపంలో 1800 ఎకరాల భూమిని రైతుల నుండి తీసుకొని సైనిక బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్, ప్రత్యేక బలగాల శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే నిర్ణయం కూడా జరిగింది. వాయుసైన్యం కోసం ఏర్పాటు చేయనున్న ఏయిర్‌బేస్ కోసం భిలాయ్‌కు దగ్గర్లోని నందిని దాని చుట్టుపక్కల గ్రామాల్లో 350 ఎకరాల భూముల్ని స్వాధీనం చేసుకోబోతున్నారు. వాయుసైన్యానికి ముందే 'ఆత్మరక్షణ' కోసం 'ఎదురుదాడి' చేసే అధికారం ఇచ్చారు. ఇప్పుడు సైన్యాన్ని 'శిక్షణ' పేరుతో బస్తర్‌కు పంపడానికి ముందే రక్షణ, న్యాయ మంత్రిత్వశాఖలు 'మార్గదర్శక సూత్రాల' పేరుతో దాడులు చేసే అధికారాలిచ్చాయి. కానీ సైనికాధికారులు తామిక్కడికి వస్తున్నది మావోయిస్టులకు వ్యతిరేకంగా దాడుల్లో పాల్గొనడానికి కాదనీ, కేవలం 'శిక్షణ' కోసమేననీ చాలా నాటకీయంగా ప్రకటనలు చేస్తున్నారు. దీన్ని నమ్మేందుకు దేశ ప్రజలంతా మూర్ఖులని వాళ్ల నమ్మకం!

ఒకవేళ వాదన కోసం వాళ్ల పని కేవలం సైన్యానికి శిక్షణ ఇప్పించడమే అనుకున్నా అసలు ఈ 'శిక్షణ' దేని కోసం అనేది అసలు ప్రశ్న! ఎవరిని చంపడం కోసం? ఈ అడవుల్లో, పర్వతాల్లో నివసిస్తున్న వేలాది ఆదివాసుల్ని తరమెయ్యాలనే కుట్రలు దేని కోసం పన్నారు? దీని అవసరం ఏమొచ్చింది? ఇక్కడున్న శత్రువులెవరు? ఎవరితో కొట్లాడడం కోసం సైన్యానికి 750 చదరపు కిలోమీటర్ల (ఒక లక్షా 85 వేల 250 ఎకరాలకు పైగా) భూమిని రమన్‌సింగ్ ప్రభుత్వం 'దానం' చేస్తున్నది? ఒకవేళ ప్రభుత్వాలు మనం నమ్మాలని కోరుకుంటున్నట్టుగా సైన్యం మోహరింపు చేయడం లేదనేది వాస్తవమైతే దీనిని ఇంత గోప్యంగా ఎందుకు వుంచుతున్నారు? ఇంత భారీ భూస్వాధీనంతో ఎన్ని గ్రామాల్ని లేకుండా చేయబోతున్నారు? ఎన్ని వేల మందిని తమ ఆవాస ప్రాంతాల నుండి వెళ్లగొట్టనున్నారు? దీని విషయంలో ఉన్నదున్నట్టుగా ఎందుకు మాట్లాడడం లేదు? ఆదివాసుల భూముల్ని పరాయివాళ్ల చేతుల్లోకి పోకుండా రక్షించడం కోసమని, ఆదివాసుల ప్రయోజనాల్ని కాపాడడం కోసమని ప్రభుత్వాలు స్వయంగా చేసిన చట్టాలన్నీ ఎటు పోయినట్టు? 5వ షెడ్యూలు, పెసా చట్టం వంటి చట్టాల్ని ఇంత బాహాటంగా ఎందుకు ఉల్లంఘిస్తున్నారు? ఈ ప్రశ్నలకు జవాబివ్వడానికి ఏ మంత్రీ, ఏ నాయకుడూ, ఏ అధికారీ సిద్ధంగా లేడు.

అయితే, మావోయిస్టులు తమపై దాడి చేస్తే మేం ఎదురుదాడి చేసి మావోయిస్టులను ఖతం చేస్తామని సైన్యాధికారులు బెదిరింపులతో కూడిన ప్రకటనలు చేస్తున్నారు. తాము చేసే దాడి పోలీసులతో, సీఆర్‌పీఎఫ్‌తో పోలిస్తే చాలా విధ్వంసకరంగా వుంటుందని కూడా చెబుతున్నారు. ఉద్దేశ్యం స్పష్టమే – వాళ్లు అడవుల లోపలికి చొరబడుతారు. అడవుల నుండీ, కొండల నుండీ, భూముల నుండీ ప్రజలను తరిమికొడతారు. మావోయిస్టులు చేయగల దాడులను 'ఎదుర్కోవడానికి' గ్రామాలపై దాడులు చేస్తారు. ప్రజలపై అత్యాచారాలకు పాల్పడతారు. అయినప్పటికీ దీన్ని ఎవరూ ఎదిరించకూడదు! ఎవరైనా ఎదిరిస్తే 'విధ్వంసకర' దాడులు చేస్తారు! వాళ్ల ప్రకటనల వెనుక దాగిన అర్థం తేటతెల్లమే! కానీ సైనిక ఉన్నతాధికారులు, ఢిల్లీలో కూర్చున్న వాళ్ల ప్రభువులు మన దేశం కంటే బాగా పేద దేశమైన వియత్నాం చేతిలో, భారత సైన్యంకన్నా ఎంతో శక్తివంతమైన అమెరికా సైన్యం పొందిన అవమానకరమైన ఓటమిని మర్చిపోతున్నారు. లక్షల సైన్యాల్ని దించినప్పటికీ కాశ్మీర్‌లోనూ, ఈశాన్య ప్రాంతంలోనూ ప్రజలను అణిచివెయ్యలేకపోయామనే విషయాన్ని మర్చిపోతున్నారు. శ్రీలంకలో తమిళ విముక్తి పోరాటయోధుల చేతిలో ఇదే భారత సైన్యం ఎలాంటి దుర్గతిని ఎదుర్కొందోనన్న చరిత్రను మర్చిపోతున్నారు. దేశం నడిబొడ్డున అత్యంత పేద ప్రజలకు వ్యతిరేకంగా సైన్యాన్ని దించడం ద్వారా నిజానికి తాము ఒక పెద్ద బండను ఎత్తడానికి ప్రయత్నిస్తున్నామనీ, అది ఆఖరుకు తమ కాళ్లపైననే పడి నుజ్జునుజ్జు చేయక తప్పదనే నిజాన్ని వాళ్లు తెలుసుకోలేకపోతున్నారు.

4,000 చదరపు కిలోమీటర్ల వైశాల్యం గల మాడ్ ప్రాంతం దేశంలోని అతి ప్రాచీనమైన, విశిష్టమైన ఆదివాసీ సముదాయాలలో ఒకటైన మాడియా ఆదివాసులకు పుట్టినిల్లు. ప్రతిపాదిత సైనిక శిక్షణ కోసం 750 చదరపు కిలోమీటర్ల భూమిని ధారాదత్తం చేయడమంటే ఇక్కడి జనాభాలో ఒక పెద్ద భాగం వునికిని ప్రమాదంలో పడవెయ్యడమే. ఒక పత్రికలో వచ్చిన వార్త ప్రకారం ఇందుకోసం 8 గ్రామ పంచాయితీలకు చెందిన 51 గ్రామాలు పూర్తిగా నామరూపాలు లేకుండా పోతాయి. వాస్తవానికి మూడేళ్ల ముందు నుండే ప్రభుత్వం ఒక కుట్ర ప్రకారమే ఈ ప్రాంతంలోని రేషన్ దుకాణాలను ఎత్తేసి వాటిని పోలీసు స్టేషన్లలో ఏర్పాటు చేసింది. మావోయిస్టులకు ప్రజల నుండి రేషన్ అందుతున్నదనీ, దాన్ని అడ్డుకోవాలనే సాకును కారణంగా చూపెట్టారు. అంతే కాకుండా, మాడ్ ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలల్ని 60–70 కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకు తరలించి పక్కా రోడ్ల మీదున్న గ్రామాల్లో ఏర్పాటు చేయబోతున్నారు. ఒక రకంగా ఈ చర్యలతో మాడ్ ప్రాంత ప్రజల్ని కుట్రపూరితంగా బైటికి తరలించే ప్రక్రియ

మొదలైందనుకోవచ్చు.

భారత పదాతిదళాల్ని బస్తర్‌కు తరలించడానికి కొంచెం ముందుగా రావ్‌ఘాట్ గనుల్ని ప్రైవేటీకరించబోతున్నట్టు తీసుకున్న నిర్ణయం కేవలం కాకతాళీయం కాదు. నిజానికి పాలకవర్గాలు ప్రారంభించిన ఈ నిర్బంధ క్యాంపెయిన్‌కు ఇక్కడి సహజ వనరుల దోపిడీతో ప్రత్యక్ష సంబంధం వుంది. దండకారణ్యం సహా దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలతో కుదుర్చుకున్న వందలాది ఎంవోయూలు ప్రజల నిరసన, ప్రతిఘటనలతో చాలా కాలంగా అమలు కాకుండా వుండిపోతున్నాయి. ముఖ్యంగా మావోయిస్టు వుద్యమ ప్రాంతాల్లో ఎన్నో వినాశకర ప్రాజెక్టులు అమలు కాకుండా నిలిచిపోయి వున్నాయి. బస్తర్ ప్రాంతాన్నే గమనించినట్టయితే ఇక్కడ ఆరేళ్లు గడిచిపోతున్నప్పటికీ టాటా, ఎస్సార్ కంపెనీల ప్రతిపాదిత స్టీలు ఫ్యాక్టరీల నిర్మాణం కోసం భూముల స్వాధీనం ప్రక్రియ ప్రజల ప్రతిఘటన మూలంగా మొదలు కాలేదు. పోరు బావుటానెత్తిన లోహాండిగూడ, ధుర్లి ప్రాంతాల వీర ప్రజానీకం దోపిడీ దొంగల లాభాల కోసం తమ భూముల్ని ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. ఉత్తర బస్తర్ ప్రాంతంలోని చార్‌గాంలో నెకో కంపెనీ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రజలు తమ కొండలపై గనుల్ని తెరవనిచ్చేది లేదని నినదిస్తూ అడ్డుకుంటున్నారు. నారాయణ్‌పూర్ జిల్లాలోని ఆమ్‌దాయ్‌మెట్టలో, భానుప్రతాప్‌పూర్ దగ్గర్లోని చార్‌గాంలో పోరాటశీలురైన ప్రజలు 'జల్-జంగల్-జమీన్'కు జరిగే వినాశనాన్ని వ్యతిరేకిస్తూ గనుల కంపెనీల యజమానుల్ని తన్ని తరిమేసారు. రావ్‌ఘాట్ రైల్వేలైన్, గనుల ప్రాజెక్టును ప్రజలు అడుగడుగునా వ్యతిరేకిస్తున్నారు. రాజ్‌నాంద్‌గాం జిల్లాలోని పల్లామాడ్ ప్రాంతంలో అనేక గనుల కంపెనీలు తమ గనులను ప్రారంభించలేకపోతున్నాయి. దీంతో దోపిడీ ప్రభుత్వాలు, గనుల మాఫియా వందల కోట్ల రూపాయల లాభాల్ని నష్టపోతున్నాయి. బోధ్‌ఘాట్ ప్రాజెక్టును కూడా ప్రజలు దృఢంగా వ్యతిరేకిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ మోసకారి ప్రభుత్వాల బూటకపు 'అభివృద్ధి రథం' ఇక్కడ ముందుకు సాగడం లేదు. సైన్యం మోహరింపును ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలి.

## భారత సైనిక జవాన్లకు విజ్ఞప్తి – ప్రజలపై యుద్ధం చెయ్యకండి! ఇక్కడి నుండి వెనక్కి వెళ్లండి!!

'శిక్షణ' తదితర సాకుల్ని చెప్పి మిమ్మల్ని ఇక్కడికి పంపించిన దోపిడీ పాలకవర్గాలు మిమ్మల్నీ, సాధారణ ప్రజల్నీ తప్పుదారి పట్టిస్తున్నాయి. ఇక్కడి ప్రజలు మీ శత్రువులు కారు. బస్తర్ శత్రు దేశం కూడా కాదు. బస్తర్ సహా దేశంలోని పలు గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో సాగుతున్న మావోయిస్టు విప్లవోద్యమం లక్ష్యం ఈ దేశాన్ని సామ్రాజ్యవాదుల, భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల దోపిడీపీడనల నుండి విముక్తి చెయ్యడం. దేశానికి నిజమైన, అసలైన స్వాతంత్ర్యాన్ని సాధించడం. అవినీతిపరులు, కుంభకోణాలకు పాల్పడేవాళ్లు, అక్రమ నిల్వదారులు, లంచగొండులు, దళారీలు, బందిపోట్లతో నిండిన ప్రస్తుత వ్యవస్థనే నిజమైన దేశాభివృద్ధికి అతి పెద్ద ఆటంకంగా వున్నది. రక్షణ శాఖ చేసుకునే ప్రతి ఒప్పందంలోనూ వందల కోట్ల రూపాయల్ని అక్రమంగా ఆర్జించే మీ వున్నతాధికారులు కూడా ఇందులో భాగమే. ఈ వ్యవస్థను సమూలంగా మార్చకుండా రెండు పూటల అన్నానికైనా నోచుకోని భారత శ్రామిక ప్రజలకు ముక్తి లభించదు. అందుకే మీ అసలు శత్రువులెవరో కళ్లు తెరచి చూడండి. దేశ ప్రజలపై, దుర్భర దారిద్ర్యంలో బతుకులీడుస్తున్న ఆదివాసుల గుండెలపై తుపాకులెక్కు పెట్టే ముందర మీరు స్వయంగా ఏ కుటుంబాల నుండి వచ్చారో ఒక్కసారి ఆలోచించండి. దేశీయ, విదేశీ కార్పొరేట్ రాబందుల ప్రయోజనాల కోసం దేశ నిరుపేద ప్రజానీకంపై సాగుతున్న ఈ అన్యాయమైన యుద్ధం నుండి మీరు వైదొలగండి. అత్యాచారాలకు, ఉత్పాతాలకు, హత్యలకు కుఖ్యాతి గాంచిన పోలీసులు, సీఆర్‌పీఎఫ్, కోబ్రా జవాన్లు ప్రజా ప్రతిఘటన మూలంగా ప్రాణాలు కోల్పోతున్నట్టుగా మీరు చనిపోవద్దని మేం కోరుకుంటున్నాం.

## దేశంలోని, ప్రపంచంలోని శ్రామిక ప్రజలకు, న్యాయాన్నీ, శాంతినీ కోరుకునే ప్రజాస్వామిక వాదులకు మా విజ్ఞప్తి

బస్తర్‌లో సైన్యం మోహరింపును ముక్త కంఠంలో నిరసించండి. సైనిక శిక్షణ సాకుతో బస్తర్ ఆదివాసుల, ప్రత్యేకించి మాడియా సముదాయం అస్తిత్వాన్ని రూపుమాపే బలవంతపు భూస్వాధీన పథకాన్ని వ్యతిరేకించండి. బస్తర్ ప్రజలు కొనసాగిస్తున్న న్యాయమైన పోరాటాలకు సంఘీభావం తెలపండి. సైన్యం మోహరింపుకూ, 'శిక్షణ' పేరుతో భూముల్ని ఆక్రమించుకునే కుట్రలకు వ్యతిరేకంగా ప్రజాందోళనలు నిర్వహించండి. వీలైన అన్ని పద్ధతుల్లో నిరసననూ, ప్రతిఘటననూ ప్రదర్శించండి. 'భారత సైన్యం వెనక్కి పోవాలి' అని గొంతెత్తి నినదించండి.

## దండకారణ్య పోరాట ప్రజానీకానికి మా విజ్ఞప్తి

'జల్-జంగల్-జమీన్'పై అధికారం సాధించడం కోసం మీరు చేస్తున్న పోరాటానికి రెండు వందల ఏళ్ల చరిత్ర వుంది. మీ సగౌరవ చరిత్రలో మీరెన్నో తిరుగుబాట్లు, పోరాటాలు చేశారు. అన్యాయం, జులుం, దౌర్జన్యం, దోపిడీ, పీడనల ముందు మీరెన్నడూ తలవంచలేదు. మీ ప్రతి ఉ ఛ్వాసనిశ్వాసంలో పోరాట వారసత్వం వుంది. మీ నరనరాలలో తిరుగుబాటు తత్వం వుంది. దోపిడీ పాలకులు మీకు వ్యతిరేకంగా ఒక అన్యాయమైన యుద్ధాన్ని రుద్ది అందులో ఇప్పుడు సైన్యాన్ని దించిన దురాగతాన్ని మీరు మీ విశాల, సమరశీల పోరాటాల ద్వారానే ఎదిరించాలి. సంఘటిత, విస్తృత, మిలిటెంట్ ప్రతిఘటన ద్వారానే భారత సైన్యం చెయ్యబోయే దాడుల్ని ఎదుర్కోగల్గుతాం. ప్రజల సైన్యమైన పీఎల్‌జీఏ ఈ ప్రతిఘటనలో అగ్రభాగాన నిలుస్తుంది.

బస్తర్ ప్రాంతంలో సైన్యం మోహరింపుకూ, సైనిక శిక్షణా కేంద్రాల ఏర్పాటుకూ, భారీ భూస్వాధీనానికీ వ్యతిరేకంగా జూలై 4 నుండి 11 వరకు మధ్య రీజియన్ ప్రాంతంలో, అంటే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఏవోబీ ప్రాంతాల్లో 'నిరసన వారాన్ని' పాటించాలని పార్టీ కేంద్రకమిటీ మధ్య రీజనల్ బ్యూరో దేశ ప్రజానీకానికి పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా దండకారణ్య ప్రాంతంలో ఈ సందర్భంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, చక్కాజాం తదితర నిరసన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రజలకూ, పార్టీ శ్రేణులకూ, పీఎల్‌జీఏకూ, ప్రజా సంఘాలకూ విజ్ఞప్తి చేస్తున్నది. పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలతో పెద్ద ఎత్తున ప్రచార క్యాంపెయిన్ చేపట్టి 'భారత సైన్యం వెనక్కి పోవాలి' అనే నినాదాన్ని మారుమోగించాలని కోరుతున్నది.

Gudsa Usendi

(గుడ్సా ఉసెండి)

అధికార ప్రతినిధి,

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)